సాక్షి
విశాఖపట్నం

సోమవారం ♦ 9 ♦ జనవరి ♦ 2023

దేవిశ్రీ ప్రసాద్ ఆటా పాట



పూనకాలు లోడింగ్..



- ఘనంగా వాల్తేర్ వీరయ్య ప్రీ రిలీజ్ వేడుక
- వేల సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): మెగాస్టార్ చిరంజీవి, మాస్ మహారాజ్ రవితేజ అభిమానుల్లో పూనకాలు లోడయ్యాయి. తమ అభిమాన నటులను నేరుగా చూసే సరికి వారిలో ఆనందాలకు హద్దుల్లేకుండా పోయాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో ఆదివారం జరిగిన వాల్తేరు వీరయ్య చిత్రం ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. చిరంజీవి, రవితేజ, డైరెక్టర్ బాబీ, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్, ఇతర నటీనటులు పాల్గొని ఈ సినిమా అనుభవాలను అభిమానులతో పంచుకున్నారు. 13వ తేదీ నుంచి తెలుగు ప్రేక్షకులకు పూనకాలు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నటి ఊర్వశి రౌటేలా, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్, డ్యాన్స్ మాస్టర్ శేఖర్, ఫైట్‌మాస్టర్లు రామలక్ష్మణ్ డ్యాన్స్‌లు వేసి అభిమానులను అలరించారు. వేర్ ఈజ్ ద పార్టీ.. పాటకు ఊర్వశి తనదైన స్టైల్‌లో స్టెప్పులు వేసి కుర్రకారును ఉర్రూతలూగించారు. మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీప్రసాద్ చిరంజీవి, రవితేజ సినిమాల్లో పాటలు పాడి.. డ్యాన్స్‌లు చేసి ప్రాంగణాన్ని హోరెత్తించారు. చివరగా డ్యాన్స్ మాస్టర్ శేఖర్, ఫైట్ మాస్టర్ రామ్ లక్ష్మణ్ పూనకాల లోడింగ్ పాటకు డ్యాన్స్ చేసి అభిమానులకు పూనకాలు రప్పించారు. చిరంజీవిని చూసేందుకు వేల సంఖ్యలో అభిమానులు ఏయూ గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. అయితే అప్పటికే గ్యాలరీలు నిండిపోవడంతో పాసులు ఉన్నప్పటికీ అభిమానులను పోలీసులు లోపలకు అనుమతించలేదు. దీంతో వేల సంఖ్యలో అభిమానులు నిరాశతో వెనుదిరిగారు.



కేథరిన్



ఊర్వశి



నవ్వులు పూయిస్తున్న సప్తగిరి, షకలక శంకర్, శ్రీనివాసరెడ్డి

గజ గజ

- చలితో వణుకుతున్న ఉమ్మడి విశాఖ జిల్లా
- చింతపల్లి, హుకుంపేటల్లో 1.5 డిగ్రీల నమోదు
- విశాఖ నగరంలో 14.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత
- మరికొన్నాళ్లు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం



దొండపర్తిలో చలి మంటలతో ఉపశమనం పొందుతున్న దృశ్యం

సాక్షి, విశాఖపట్నం: కొన్నాళ్లుగా శీతాకాల ఛాయలే అంతగా అనిపించలేదు. చలి తీవ్రత కనిపించలేదు. సాధారణ వాతావరణంతో ఆహ్లాదాన్ని పంచింది. కానీ ఒక్కసారిగా శీతలం విజృంభించింది. రికార్డు స్థాయి కనిష్ట ఉష్ణోగ్రతలు జనాన్ని వణికిస్తున్నాయి. మైదానం కంటే ఏజెన్సీ (గిరిజన) ప్రాంతాల్లో చలి గజగజలాడిస్తోంది.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. తాజాగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు చింతపల్లి, హుకుంపేట, జి.మాడుగులల్లో 1.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ సీజనులో ఇదే అత్యల్పం కావడం విశేషం. ఆ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు 1.5 నుంచి 8 డిగ్రీల మధ్య నమోదవుతూ శీతల ప్రతాపాన్ని చూపుతున్నాయి. ఇంకా అనకాపల్లి, విశాఖ జిల్లాలోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు క్షీణిస్తూ చలి ప్రభావాన్ని పెంచుతున్నాయి. అనకాపల్లి జిల్లాలోని చోడవరం, రోలుగుంట, వి.మాడుగుల, మునగపాక, చీడికాడ, కశింకోట, నక్కపల్లి మండలాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఇక విశాఖ జిల్లాలోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. భీమిలిలో పెందుర్తిలో అత్యల్పంగా 11.8, భీమిలిలో 12.9, విశాఖ వాల్తేరులో 14.2, విశాఖ రూరల్‌లో 14.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వీటికి ఈశాన్య, ఉత్తర గాలులు కూడా తోడవడంతో జనం చలిని తట్టుకోలేకపోతున్నారు. ఇళ్లలో తలుపులు మూసుకున్నా రగ్గులు, కంబళ్లు వంటివి కప్పుకున్నా చలి వదిలి పెట్టడం లేదు. మరో వారం రోజుల పాటు చలి తీవ్రత కొనసాగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అందువల్ల చలి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వీరు సూచిస్తున్నారు. కాగా విశాఖలో గడచిన 11 ఏళ్లలో ఆదివారం నాటి 14.2 డిగ్రీల ఉష్ణోగ్రతే అత్యల్పం.

విశాఖలో కనిష్ట ఉష్ణోగ్రతలు

సంవత్సరం/తేదీ	ఉష్ణోగ్రత
06.01.1962	10.5
30.11.1970	12.9
02.01.2012	14.8
23.01.2019	16.0
28.01.2011	16.2

ఉమ్మడి విశాఖలో కనిష్ట ఉష్ణోగ్రతలు

ప్రాంతం	ఉష్ణోగ్రత	ప్రాంతం	ఉష్ణోగ్రత
చింతపల్లి	1.5	వి.మాడుగుల	10.8
హుకుంపేట	1.5	పెందుర్తి	11.8
జి.మాడుగుల	1.5	చోడవరం	12.5
జీకేవీధి	2.2	భీమిలి	12.9
పాడేరు	3.0	మునగపాక	13.9
అరకులోయ	3.3	కశింకోట	14.5
		వాల్తేరు	14.2

● 'జన'దాంబ జంక్షన్



పెద్ద పండగ సంక్రాంతి నేపథ్యంలో వస్త్రాలు కొనుగోలు చేసేందుకు నగరం నుంచే గాక జిల్లా నలుమూలల నుంచి ఆదివారం పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో జగదాంబ జంక్షన్ నిండిపోయింది. ఒక్కో దుకాణం ముందు వందలాది మంది కొనుగోలుదారులు క్యూ కట్టారు. జగదాంబ జంక్షన్‌లోని సీఎంఆర్ షాపింగ్ మాల్, సీఎంఆర్ ఫ్యాషన్, తుమ్మిడి బ్రదర్స్, కేఎల్ఎం, ఎస్ఆర్ షాపింగ్ మాల్, లక్కీ, కంచి కామాక్షి, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, కంకటాల వంటి పెద్ద షోరూంలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పెద్ద ఎత్తున వస్త్రాలు కొనుగోలు చేయడంలో మార్కెట్‌కు పండగ శోభ వచ్చింది. డాబాగార్డెన్స్‌లోని ఆర్.కె., లక్కీ, రిలయన్స్, తదితర షోరూంల్లోనూ పండగ సందడి నెలకొంది.

- డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ)

ముగిసిన గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్



వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబును సన్మానిస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): నగరంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ఆదివారంతో ముగిసింది. దేశ విదేశాల నుంచి సుమారు 450 వైద్యులు సమ్మిట్‌లో పాల్గొనగా.. సంపూర్ణ ఆరోగ్యం, ఆత్మహత్యల నివారణ, మానసిక అనారోగ్యం, అవగాహన, శిశు, మాతాశిశు మరణాలు, పోషకాహారం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు సదస్సు నిర్వాహకుడు, విశ్రాంత డీఎంఈ డాక్టర్ టి.రవిరాజ్ తెలిపారు.

యూఎస్ఏ నుంచి 100 మంది ప్రతినిధులతో పాటు ప్రపంచ నలుమూలల నుంచి వైద్య నిపుణులు హాజరై క్యాన్సర్ల చికిత్స, నివారణ, ఆయుర్వేదం, గ్రామీణ ఆరోగ్య కార్యక్రమాలు, టీకా, వైద్య విద్యలో సంస్కరణలు, కార్డియాక్ జబ్బుల గురించి విస్తృతస్థాయిలో చర్చించారు. అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ ఆరిజెన్ (ఏపీపీఐ) అధ్యక్షుడు డాక్టర్ రవి కొల్లి ఆధ్వర్యంలో దేశ, విదేశీ వైద్య నిపుణులు మానసిక వైద్యం, నెఫ్రాలజీ, చిన్నారుల ఆరోగ్యం, హృద్రోగ సమస్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమ్మిట్‌లో తొలిరోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశం ఇచ్చారు. వైద్య, ఆరోగ్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.నివాస్, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.ఎస్.నవీన్ కుమార్ మాట్లాడారు. 7న ఏపీ, తెలంగాణ గవర్నర్లు బిశ్వభూషణ్ హరిచందన్, తమిళ సై వర్చువల్‌గా ప్రసంగించారు. ఆదివారం ఆర్.కె.బీచ్‌లో జరిగిన వాక్‌ను రియర్ అడ్మిరల్ రాజారవి ప్రారంభించారు. ముగింపు కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు పాల్గొని ప్రసంగించారు.

ఏపీపీఐ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌రెడ్డి, డాక్టర్ జొన్నలగడ్డ సుధాకర్, డాక్టర్ రఘు, డాక్టర్ విశ్వేశ్వర రంగా, డాక్టర్ సౌమ్య సోమనాథన్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, డాక్టర్ పి.వి.సుధాకర్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ అభిజిత్ షేత్, డాక్టర్ శ్రీధర్ చిలిమూరి, గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ఇండియా చైర్మన్ డాక్టర్ ప్రసాద్ చలసాని, డాక్టర్ నాగేంద్ర మైనేని, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ టీఎస్ ప్రసాద్, డాక్టర్ కల్పన వైద్యుడు విజయశేఖర్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మోహన్ మహారాజ్, మహిళా కన్వీనర్ డాక్టర్ టి.రాధ తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

నేడు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సమావేశం

హాజరుకానున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

మహారాణిపేట(విశాఖ దక్షిణ): వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సమావేశం సోమవారం విశాఖలో నిర్వహించనున్నారు. సిరిపురం వీఎంఆర్‌డీఏ బాలల ఎరీనాలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ సమావేశానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ముఖ్యఅతిథిగా హాజరవుతారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, కార్యదర్శి నవీన్ కుమార్, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ పాల్గొంటారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి వైద్య ఆరోగ్యశాఖాధికారులు, అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారులు, ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పలు విషయాలపై చర్చించనున్నారు.



అలరించిన డాగ్ షో



కనువిందు చేసిన విభిన్న జాతుల శునకాలు









ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): డాగ్ షో–2023 అలరించింది. విభిన్న జాతుల శునకాలు కనువిందు చేశాయి. నగర పెట్ ప్రియులు ఖుషీ అయ్యారు. విశాఖ కెనైన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంవీపీకాలనీలోని ఆళ్వార్‌దాస్ మైదానంలో డాగ్ షో నిర్వహించారు. నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి 37 జాతులకు చెందిన 527 శునకాలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఒక్కో జాతి నుంచి రెండు శునకాలను తొలి ప్రదర్శనలో నిలవగా తుది పోటీకి పలు జాతులకు చెందిన ఎనిమిది శునకాలను ఎంపిక చేశారు. వాటిలో బెస్ట్ బ్రీడ్, బెస్ట్ దేశవాళీ బ్రీడ్ శునకాలను ఎంపిక చేశారు. దీంతో పాటు బెస్ట్ డాగ్, బెస్ట్ పప్పీలను కూడా ఈ షో ద్వారా ఎంపిక చేసినట్లు సంస్థ అధ్యక్షుడు ప్రకాష్ వెల్లడించారు. పలు జాతులకు చెందిన శునకాల పెంపకం, పరిరక్షణలో భాగంగా ఈ షో నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా శునకం రంగు, ముక్కు, పరిగెత్తే విధానం, యజమాని ఆదేశాలు పాటిస్తున్న విధానం వంటి అంశాలను ఎంపికల్లో ప్రధానంగా పరిశీలించారు. ఈ పోటీల్లో రాట్‌విల్లర్, జర్మన్ షెపర్డ్, గోల్డెన్ రిట్రీవర్, డాబర్‌మెన్, మేస్టిఫ్, నియోపొలిటన్, సెయింట్ బర్నర్డ్, లాబ్రడార్ వంటి జాతులకు చెందిన శునకాలు పాల్గొన్నాయి. తొలుత ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన శునకాల యజమానులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పెదసోములతో పాటు పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



క్యూటీతో చిన్నారి







రక్తనిధికై.. అలుపెరగక

- రక్తదానంపై ప్రజల్లో అవగాహనకు యువకుడి సాహసం
- 21 వేల కిలోమీటర్లు లక్ష్యంగా సాగుతున్న పాదయాత్ర
- 2021 డిసెంబర్‌లో తిరువనంతపురంలో ప్రారంభం
- కిరణ్‌కు స్వాగతం పలికిన నగరంలోని రక్తదాతలు



కిరణ్ వేర్మ

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): రక్తం కొరతతో ఆస్పత్రిలో ఓ రోగి చావు బతుకుల మధ్య పోరాటం చేస్తున్నాడు. రక్తం కావాలని ఓ యువకుడికి ఫోన్ కాల్ వచ్చింది. అందుకు స్పందించిన ఆ యువకుడు ఆ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశాడు. అయితే తర్వాత రోజు ఆ యువకుడికి ఓ విషయం తెలిసింది. తనకు ఫోన్ చేసిన వ్యక్తి ఆ రోగి నుంచి రూ.1,500 తీసుకున్నాడని తెలిసి షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనతో అసలు రక్తదానంలో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి విచారణ చేపట్టాడు. రక్తం కొరత తీర్చడానికి తనవంతుగా ఏదో ఒకటి చేయాలని భావించాడు. సింప్లీ బ్లడ్ అనే సంస్థను స్థాపించి.. దేశ వ్యాప్తంగా రక్తదానంపై అవగాహన కల్పించేందుకు 21 వేల కిలోమీటర్ల పాదయాత్రకు శ్రీకారం చుట్టాడు. అతనే ఢిల్లీకి చెందిన 38 ఏళ్ల కిరణ్ వేర్మ. కిరణ్ పాదయాత్ర ఆదివారం నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా రక్తదాతలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

రక్తం కొరత తీర్చేందుకు..

తాను మోసపోయినట్లు మరొకరు మోసపోకూడదని కిరణ్ 2017లో వర్చువల్ బ్లడ్ డొనేషన్ ప్లాట్ ఫాం, సింప్లీ బ్లడ్ సంస్థలను నెలకొల్పాడు. సింప్లీ బ్లడ్ అనేది మొబైల్ యాప్/వెబ్‌సైట్. దీని ద్వారా రక్త నిల్వలు, రక్తదాతల సమాచారం తెలుసుకోవచ్చు. వర్చువల్ బ్లడ్ డొనేషన్ ద్వారా 180 దేశాలకు చెందిన రక్తదాతలను అనుసంధానం చేసి రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు.

చేదు అనుభావాలే పాదయాత్రకి స్ఫూర్తి

'ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కోవిడ్ నుంచి ప్రాణాలు రక్షించుకునేందుకు ప్లాస్మా అవసరం ఏర్పడింది. ముఖ్యంగా రెండో దశలో ప్లాస్మా కోసం వేల సంఖ్యలో రోగులు ఎదురు చూశారు. సింప్లీ బ్లడ్‌కు వేల వినతులు వచ్చాయి. కోవిడ్ నుంచి కోలుకున్న యువతకు ఫోన్ చేసి ప్లాస్మా దానం చేయాలని కోరాను. అయితే చాలా మంది ప్లాస్మాదానం చేసేందుకు ముందుకు రాలేదు. అప్పుడే దేశవ్యాప్తంగా ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పించాలనే ఆలోచన మొదలైంది.' అని కిరణ్ తెలిపాడు. 2021 డిసెంబర్ 28న తిరువనంతపురంలో 21 వేల కిలోమీటర్ల పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు చెప్పాడు. రోజుకు 10 నుంచి 30 కి.మీ మేర పాదయాత్ర సాగిస్తున్నట్లు వివరించాడు.

రక్తం కొరత లేకుండా చేయడమే ధ్యేయం

రక్తం సమయానికి అందక ఏడాదికి లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అలా జరగకుండా ఉండాలంటే ఏటా 50 లక్షల మంది రక్తం దానం చేయాలి. అలా చేయడం ద్వారా 2026 నాటికి దేశంలో రక్తం కొరత అనేది ఉండదు. అలా చేయడమే నా లక్ష్యం. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా. నా లక్ష్యాన్ని చేరుకోవడానికి మరో ఏడాది సమయం పడుతుంది. ఈ పాదయాత్రలో ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నా. సరైన ఆహారం తీసుకుంటూ.. నిరంతరం వైద్యులతో సంప్రదింపులు చేసుకుంటూ యాత్రను కొనసాగిస్తున్నాను.

– కిరణ్

ప్రశాంతంగా గ్రూప్‌–1 పరీక్ష


మహిళా కళాశాల కేంద్రంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): జిల్లాలో ఆదివారం గ్రూప్‌–1 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 42 పరీక్ష కేంద్రాల్లో 11,559 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. మొత్తం 16,935 అభ్యర్థులకు 11,559 మంది హాజరయ్యారని.. 68.24 శాతం నమోదయిందన్నారు. ఏపీపీఎస్సీ గౌరవ సభ్యుడు సోనీ వుడ్ కలెక్టర్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్, పరీక్ష కేంద్రాలను సందర్శించారు. జిల్లా కోఆర్డినేటర్, డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి బి.వి.కె. కళాశాల సెంటర్‌ను, ఏపీపీఎస్సీ డిప్యూటీ సెక్రటరీ కేజియా ప్రసూన, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్(విశాఖ), ఎస్. భాస్కర రెడ్డి(భీమిలి) అన్ని కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ల వద్ద హెల్ప్‌డెస్క్‌లు, కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించారు.

భళా బాలకా..

- సైనిక విన్యాసాలను తలపించిన విద్యార్థుల ప్రదర్శనలు
- వైభవంగా గుడిలోవ విజ్ఞాన విహార్ వార్షికోత్సవం


సామూహికంగా పిరమిడ్ విన్యాసం చేస్తున్న విద్యార్థులు


మోటార్ బైక్‌పై విద్యార్థినుల విన్యాసం


మోటార్ బైక్‌తో హైజంప్ చేస్తున్న విద్యార్థి

ఆనందపురం : మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార్ విద్యాలయం వార్షికోత్సం సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు సైనిక విన్యాసాలను తలపించాయి. ఆహూతులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. కొన్ని సాహసోపేతమైన విన్యాసాలు ఔరా అనిపించాయి. మండుతున్న అగ్నిగోళం నుంచి మోటార్ బైక్‌తో దూకడం, ట్యూబ్ లైట్లను పగలు గొట్టుకొని మోటార్ బైక్‌తో దూకడం, హైజంప్ చేస్తూ ట్యూబులైట్లను పగలు గొట్టుకొని దూకడం వంటి విన్యాసాలు గగుర్పాటు కలిగించాయి. వారిలో గల ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిశాయి. విద్యార్థి, విద్యార్థినులు మోటార్ సైకిల్‌పై ముగ్గురు నుంచి ఏడుగురు వరకు నిలబడి ఆసనాలు వేయడం, జాతీయ పతకాలు చేతబూని విన్యాసాలు చేయడం ఆశ్చర్యం కలిగించాయి. మల్లకంబపై ఒక పద్ధతిలో విద్యార్థులు కూర్చొని నిప్పుకాగడాలతో ఒకే సారి మంటలను రేపిన అంశం విద్యార్థుల సాహసానికి నిదర్శనంగా నిలిచింది. పేర్లార్ బార్‌పై విద్యార్థులు నిలబడి నిర్మించిన పిరమిడ్ గోపురం అంశం, 20 మంది విద్యార్థులు ఒకేసారి ఒకే స్పీడ్‌లో చేసిన వ్యాయామ విన్యాసాలు, వివిధ రకాల పద్మాకార విన్యాసాలు, గిరిజన నృత్యాలు, కోలాటం వంటి అంశాలను, సంగీతం, సాహిత్యం మేళ వింపుతో అభినయించిన తీరు విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు, విజ్ఞాన్ విహార్ చైర్మన్ పి.రామకృష్ణమూర్తి, ఆర్‌ఎస్ఎస్ ప్రెసిడెంట్ పి.వి.నారాయణ, విజయనగరం డీఆర్‌వో ఎం.గణపతిరావు, విజ్ఞాన విహార కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరావు, నోవస్ కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ పార్టనర్ ధర్మేంద్ర వరద పాల్గొన్నారు.


నడుస్తున్న మోటారు బైక్ పై ఆసనాలు వేస్తున్న విద్యార్థిని


మల్ల కంబపై నిప్పుకాగడాలతో మంటలు రేగిస్తున్న విద్యార్థులు


ట్యూబ్ లైట్లను పగలు గొట్టుకుంటూ బైక్‌తో దూకుతున్న విద్యార్థి


మండుతున్న అగ్నిగోళం నుంచి మోటార్ బైక్‌తో దూకుతున్న విద్యార్థి

ఉత్సాహంగా జిమ్నాస్టిక్స్ పోటీలు


ఫ్లోర్‌ఎక్సర్‌సైజ్ అంశాల్లో పోటీపడుతున్న జిమ్నాస్ట్‌లు

విశాఖ స్పోర్ట్స్ : రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ శాప్ లీగ్ స్టేజ్ 2 పోటీలు డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగాయి. ఐదేళ్ల నుంచి పదిహేనేళ్ల బాలబాలికలకు ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, టేబుల్‌వాల్ట్, పారలల్‌బార్స్, బాలెన్సింగ్ బీమ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. బాలుర ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో ప్రీస్కూల్ గ్రూప్‌లో చార్విక్, లిఖిత్, జమీల్ తొలి మూడు స్థానాల్లో నిలవగా.. లోయర్ ప్రైమరీ గ్రూప్‌లో మెహినీష్, ప్రసన్న తొలి రెండు స్థానాల్లో నిలిచారు. టేబుల్‌వాల్ట్ క్యాడెట్ గ్రూప్‌లో కృతిక్, లెహర్‌వలీ, మిని సబ్‌జూనియర్ గ్రూప్‌లో ముఫసిర్, విగ్నేష్ తొలి రెండు స్థానాల్లో నిలవగా, సబ్‌జూనియర్ గ్రూప్‌లో శివగణేష్, యశ్వంత్, రామసాయి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. బాలికల ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో ప్రీస్కూల్ గ్రూప్‌లో సపూర, అభివిశ్య, రిస్తిక తొలి మూడు స్థానాల్లో నిలవగా లోయర్ ప్రైమరీ గ్రూప్‌లో పల్లవి, కీర్తి తొలి రెండు స్థానాల్లో నిలిచారు. బాలెన్సింగ్ బీమ్ క్యాడెట్ గ్రూప్‌లో నక్ష్వా, హారిక, మినిసబ్ జూనియర్ గ్రూప్‌లో లక్ష్మి, కౌశల్య తొలి రెండు స్థానాల్లో నిలిచారు. విశాఖ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను శాప్ ఎండీ కె.శారదాదేవి ప్రారంభించారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి


కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ కృష్ణమోహన్ దంపతులు

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, స్వామి జ్ఞాపికను ఏఈవో నరసింహరాజు న్యాయమూర్తికి అందజేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

కొమ్మాది: రుషికొండలో కొలువై ఉన్న మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి బొప్పిడి కృష్ణమోహన్ దంపతులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి దర్శించుకున్నారు. అంతరాలయంలో పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఏఈవో యు.రమేష్, ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ రాజు స్వాగతం పలికారు.

సాక్షి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE

3 BHK, 1840 Sft, North Facing, 5th Floor, At Kommadhi. Near Madhurawada Price-4500/- Sft. Contact : 81868 08531, 83419 89189 [V- 2105]

PLOT FOR SALE

VMRDA + AP RERA Approve Layout, Offer Price: Per Sq.yd. Rs. 6500/- Near Nellimarla, VZM Dist, 100% Vastu Spot Registration, Bank Loan Ph: 9848840122, 9000352156. [HA-879]

కోటపాడు దగ్గర్లో 60 చ॥గ॥ ఇంటి స్థలం కేవలం 2లక్షలకే విలేజ్ ఆనుకొని, ల్యాండ్ కన్వర్షన్, 30 ft రోడ్స్ తక్షణమే ఇల్లు కట్టుకొనే సౌకర్యంతో 100, 150 చ॥గ॥ ప్లాట్స్ కలవు. ఫోన్: 73964 46819 [V-2382]

SITE FOR SALE

Site for sale at Nammivaripeta Jn. Tagarapuvalasa ANITS College Amy's School Between (126 Square Yards). Cont : 94909 52819 [V- 775076]

ఆయుర్వేదం

బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-888]

GOLD LOANS

లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 3001]

MARRIAGE SERVICE

హిందువులలో అన్ని కులముల వారికి మొదటి మరియు ద్వితీయ వివాహములు చూడబడును. స్వయంగా మేమే వచ్చి వధువు లేదా వరుడు యొక్క వివరములు తీసుకుంటాము. ముందుగా ఎటువంటి ఫీజు అవసరం లేదు. (షరతులు వర్తిస్తాయి). ఫోన్: 89776 36485 [V- 10036]

T.V. REPAIR

SVS TV రిపేర్స్ : 83677 16961 LED, LCD, A/C, వాషింగ్ మిషన్స్, ఫ్రిజ్, మైక్రోఓవెన్, మీ ఇంటి వద్దనే స్పాట్ రిపేర్ చేయబడును. 25 సం॥ Ex, 5 సం॥ వారంటీ కలదు. [V-775017]

Wanted

మీ బైక్ మీకు ఆదాయం తెస్తుంది. Rs.1500/ Day Benefits : P/F, జాబ్, సౌకర్యవంతమైన పని వేళలు, డైలీ / వీక్లీ ఇన్సెంటివ్స్, ఇన్సూరెన్సు 5 లక్షలు వరకు. ఫోన్: 040-49171799, 73962 67109 [V- 10030]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776004]

శ్రీరామ్ ఫైనాన్స్ : గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, యలమంచిలి, అచ్యుతాపురం ఈ బ్రాంచ్‌లో పనిచేయుటకు యువతీ / యువకులు కావలెను. అర్హత : ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ. ఫోన్: 83419 15553 89789 35673. అడ్రస్ : గాజువాక డివిజన్ బ్రాంచ్, Nr. మోహిని థియేటర్, OPP బజానా [V-11411]

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు దిగువ బ్రాంచ్‌లో పనిచేయుటకు యువతీ / యువకులు కావలెను. ద్వారకానగర్, MVP, మహారాణిపేట, మధురవాడ, NAD, పెందుర్తి, కొత్తవలస ఏరియాలలో రికవరి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ స్టాఫ్ కావలెను. అర్హత : డిగ్రీ పాస్. వయస్సు : 28 సం॥లోపు. సంప్ర : 89783 80138, 90004 04176 [V-11412]

హరేకృష్ణ హోంకేర్ విజయవాడలో వృద్ధులను / పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు (M/F) కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం16,000/- ✆ 96405 28899, 96406 48899 [B-768]

CHANGE OF NAME

I, VIJAPURAPU SWETHA (Old Name) resident of D.No: 4-62-17, Flat No - 402, SR Unique Apartments, Lawsons Bay Colony, Visakhapatnam -530017, AP, have changed my name from VIJAPURAPU SWETHA (old name) to VIJAPURAPU ANUPA (new name). Hence after all my documents and correspondence will be continued with my new name VIJAPURAPU ANUPA.

ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్‌టైం 1గం॥ పోస్టల్ కవర్స్‌పై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. కాల్/వాట్సప్. 9704987227 [G-776006]

Wanted Jr Accountant & Marketing Executive for Mak Lubricants Distributor Ph: 9246626069 [HA-7987]

ప్రముఖ హౌస్ కీపింగ్ సంస్థలో పనిచేయుటకు అనుభవం గల ఫీల్డ్ ఆఫీసర్స్, సూపర్ వైజర్స్, షాపింగ్ మాల్ లో హెల్పర్స్, టైలర్స్ కావలెను. Sal: 15k to 25k. కన్సల్‌టెన్సీ కాదు. సిరిపురం. ఫోన్.9989806121. [HA-10030]

ఇంటర్‌నేషనల్ ఏయిర్‌పోర్ట్‌లో కార్గో సూపర్‌వైజర్స్ హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటి సూపర్‌వైజర్స్ లోడర్స్, సెక్యూరిటి గార్డ్స్, కావలెను, జీతం: 21K to 30K, రూం+మీల్స్ ఫ్రీ. Q: 5th to డిగ్రీ. 8886186894. [H-778953]

కావేరి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నందు మీఇంటి వద్దనే ఉండి పార్ట్/ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు యువతి, యువకులు కావలెను. జీతం: 13-18 వేలు, Ph: 8276971388, 8276055797 [HA-851]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!! సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.



- అద్దెకు
- అమ్మకం
- రియల్ ఎస్టేట్
- ఫర్నీచర్స్
- ఆటోమొబైల్స్
- కంప్యూటర్స్
- సర్వీసెస్
- కావలెను

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు సాధ్యమే..

- విశాఖ ఆర్గానిక్ మేళా కార్యదర్శి షణ్ముఖరావు
- మూడో రోజు భారీగా సందర్శకుల తాకిడి



సదస్సులో మాట్లాడుతున్న షణ్ముఖరావు

ఎంవీపీకాలనీ: ప్రకృతి వ్యవసాయంతో లాభాలు సాధ్యమేనని విశాఖ ఆర్గానిక్ మేళా కార్యదర్శి వి.షణ్ముఖరావు అన్నారు. గో ఆధారిత వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశాఖ ఆర్గానిక్ మేళా–2023లో భాగంగా ఆదివారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఆవు ఆధారంగా 30 ఎకరాల్లో వ్యవసాయం చేసేందుకు అవకాశం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం ప్రారంభించిన రెండేళ్లలోనే భూమి సారం పెరుగుతుందన్నారు. తద్వారా పంటల నాణ్యత, ఉత్పత్తి గణనీయంగా పెరుగుతాయన్నారు. దీర్ఘకాలంలో సేంద్రియ వ్యవసాయం లాభాలకు బాటలు వేస్తుందన్నారు. గో ఆధారంగా పాలేకర్ విధానంలో సేంద్రియ వ్యవసాయం ఏవిధంగా చేయాలో రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ పాలేకర్ విధానంలో వ్యవసాయం ఆరోగ్యకరం, రుచికరం, ఆదాయవంతంగా ఉంటుందన్నారు. ఐటీ ఉద్యోగం చేస్తూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న యువ రైతు రిషి, తూర్పుగోదావరికి చెందిన సత్యలక్ష్మీనరసింహ ప్రకృతి వ్యవసాయంలో మెలకువలను తెలియజేశారు. గ్రీన్ క్లైమేట్ టీమ్ కార్యదర్శి జేవీ రత్నం జీవవైవిధ్యం ఆధారంగా వ్యవసాయం ఎలా చేయాలి, తక్కువ పెట్టుబడితో ఎలా లాభాలు ఆర్జించాలని అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి, సంఘం అధ్యక్షుడు పీఎల్ఎన్ రాజు, కార్యదర్శి యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ మేళాలో సేంద్రియ పంటలతో కూడిన 120 స్టాల్స్‌ను ఏర్పాటు చేయగా 3వ రోజు కూడా భారీగా సందర్శకులు తరలివచ్చి విక్రయాలు చేశారు.

రుచికరంగా సత్త్వ మిల్లెట్ ఫుడ్


సత్త్వ స్టాల్ వద్ద సందర్శకుల సందడి

ప్రదర్శనలో సత్త్వ సంస్థ ఏర్పాటు చేసిన మిల్లెట్ ఫుడ్ కోర్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాగులు, సజ్జలు, జొన్నలతో పాటు సేంద్రియ చిరుధాన్యాలతో కూడిన 35 రకాల వంటకాలను సందర్శకులకు అందించింది. రూ.100 నుంచి ఆయా ఉత్పత్తులతో భోజనం అందుబాటులో ఉండటంతో సందర్శకులు పెద్ద ఎత్తున విక్రయాలు చేసి ఆయా పదార్థాలను రుచిచూశారు. దీంతోపాటు అల్పాహార పదార్థాలను అందుబాటులో ఉంచింది. అనేక రకాల ఉత్పత్తులతో తయారు చేసిన చిరుతిండ్లను సైతం ఈ సంస్థ అందుబాటులో ఉంచడంతో కొనుగోళ్లు జోరుగా జరిగాయి. చిరుధాన్యాలతో కూడిన ఆహార ఉత్పత్తులను నగర ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు త్వరలోనే ఆర్యోగ రథం అనే సంస్థను అందుబాటులోకి తేనున్నట్లు సత్త్వ నేచురల్స్ నిర్వాహకులు వెల్లడించారు.

కోనసీమ.. వెల్‌విష్


విక్రయిస్తున్న కొబ్బరి ఉత్పత్తులు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరానికి చెందిన కోనసీమ వెల్‌విష్ సంస్థ ప్రదర్శించిన కొబ్బరి ఉత్పత్తులు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక ప్లాంట్ ద్వారా తయారు చేసిన కొబ్బరి ఆయిల్, కొబ్బరి ఫౌడర్, కొబ్బరి మిల్క్‌లను ఇక్కడ ప్రదర్శనలో ఉంచారు. దీంతో పాటు కొబ్బరి వాటర్ మార్కెటింగ్ కూడా ఈ సంస్థ చేపట్టింది.

హాట్ అండ్ కూల్ బ్యాగ్స్



గుంటూరుకు చెందిన సంస్థ విక్రయించిన హాట్ అండ్ కూల్ బ్యాగ్స్ మేళా సందర్శకులను ఆకట్టుకున్నాయి. సింథటిక్ క్లాత్‌తో ఈ బ్యాగ్‌ను తయారు చేశారు. బ్యాగులో వాటర్ నింపుకునేందుకు వీలుగా మూత నిర్మాణం చేశారు. దీంతో ఈ బ్యాగ్‌లో హాట్ వాటర్‌తో పాటు కూల్ వాటర్ నింపుకుని శరీర అలసట సమయంలో మర్దన చేసుకోవచ్చు. వాటర్ బ్యాగ్ నుంచి బయటకు కారకుండా సింథటిక్ క్లాత్‌ను వాడారు.

నేడు డయల్ యువర్ మేయర్, స్పందన

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ మేయర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజలు తమ సమస్యలను టోల్‌ఫ్రీ నెంబరు 180042500009కు డయల్ చేసి తెలియజేయవచ్చు. అలాగే ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్నారు.

రాజధాని ప్రస్తావన లేకుండా చర్చావేదికలెందుకు?

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

నక్కపల్లి/పాయకరావుపేట: రాజధాని ప్రస్తావన లేకుండా చర్చా వేదికలు నిర్వహించడం ఎందుకని ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రశ్నించారు. ఆదివారం ఆయన పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడుతూ కొంతమంది గెద్దలు ఉత్తరాంధ్ర చర్చావేదిక నిర్వహించడం హాస్యాస్పదమన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబడిందని, అభివృద్ధి కోసం ప్రజలు ఏం కోరుకుంటున్నారన్న నినాదంతో చర్చ పెట్టారన్నారు. ఈ వేదికలో రాజధాని ప్రస్తావన తీసుకురాకపోవడం సిగ్గుచేటన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని పోగొట్టుకోవడం కోసమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించారన్నారు. ఉత్తరాంధ్రలో సింహభాగమైన విశాఖపట్నంలో పరిపాలనా రాజధాని ఏర్పాటుకు వీరంతా అంగీకరిస్తున్నారా లేదా అనేది బహిరంగంగా ప్రకటించిన తర్వాత అభివృద్ధి గురించి మాట్లాడాలన్నారు. ఈ ఉత్తరాంధ్ర చర్చావేదిక నిర్వహించిన వారంతా ఒకే పార్టీకి కొమ్ము కాసే వారేనన్నారు.

ఎన్ఎండీసీ టోర్నీ విజేత ఆర్ఐఎన్ఎల్

విశాఖ స్పోర్ట్స్: ఎన్ఎండీసీ కప్ క్రికెట్ ఫైనల్స్‌లో డీఆర్ఎం జట్టుపై ఆర్ఐఎన్ఎల్ జట్టు విజయం సాధించింది. రెండు రోజుల పాటు రైల్వే స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో నాలుగు జట్లు పోటీపడగా ఆదివారం ముగిశాయి. రెండో రోజు జరిగిన పోటీల్లో డీఆర్ఎం జట్టు మూడు వికెట్లకు 131 పరుగులు చేయగా ఎన్ఎండీసీ జట్టు ఐదు వికెట్లకు 73 పరుగుల వద్ద ఇన్నింగ్స్ ముగించింది. మరో మ్యాచ్‌లో ఆర్ఐఎన్ఎల్ ఏడు వికెట్లకు 67 పరుగులు చేయగా ఎఎంఎన్ఎస్ జట్టు నాలుగే వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. ఫైనల్స్‌లో డీఆర్ఎం జట్టు మూడు వికెట్లకు 137 పరుగులకు ప్రతిగా ఆర్ఐఎన్ఎల్ జట్టు మూడే వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. డీఆర్ఎం అనూప్‌కుమార్ విజేతలకు ట్రోఫీలందించగా ఎన్ఎండీసీ ఈడీ పర్సనల్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్లు డి.కె.మహంతి, ఎకె బాగీ, ఎఎంఎన్ఎస్ హెచ్ఆర్ డిఎస్‌వర్మ పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,960
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.51,300
వెండి(కిలో):	రూ.74,400

నగరంలో నేడు

- ఉదయం 10 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వద్ద నివాస హక్కులు పోరాట దిశ–దశలపై సదస్సు కార్యక్రమం
- ఉదయం 10:30 గంటలకు మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం
- ఉదయం 11 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 108 ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ధర్నా

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.118
స్కిన్	: రూ.206
స్కిన్‌లెస్	: రూ.216

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	560.00
విజయనగరం	564.00
శ్రీకాకుళం	564.00